మున్సిపల్ వాహనాలు మూలకు

- కొనుగోలులో ఉత్సాహం.. నిర్వహణలో నిర్లక్ష్యం
- యార్డుల్లోనే తుప్పు పడుతున్న వైనం..
- ప్రజాధనం దుర్వినియోగం

మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ కోసం బల్దియా పాలకవర్గాలు లక్షల రూపాయలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేస్తున్నాయి. అధికారులు, పాలకులు వాహనాల కొనుగోలుపై చూపిన ఆసక్తి.. వాటి నిర్వహణలో మాత్రం చూపడం లేదు. కొన్నామా.. తెచ్చామా.. మూలన పడేశామా అన్నట్లుగా జిల్లాలో పరిస్థితి ఉంది. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది. ఇంకా కొన్ని, చిన్న మరమ్మతు రాగానే యార్డుకు తరలిస్తున్నారు. మరమ్మతు చేయిస్తే వినియోగించే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో తప్పా మరే మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో వాహనాలు వినియోగంలో లేవు.

– బెల్లంపల్లి



బెల్లంపల్లి పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో రిపేరుకు వచ్చి మూలనపడ్డ వాహనాలు

మున్సిపల్ అవసరాలకు అనుగుణంగా రకరకాల వాహనాలు కొనుగోలు చేశారు. రోజువారీగా మున్సిపల్ వార్డుల్లో సేకరించిన చెత్తను డంప్‌యార్డుకు తరలించడం, అత్యవసర పరిస్థితుల్లో నీటి సరఫరా చేయడం, దుమ్ముధూళితో ఉన్న రోడ్లను శుభ్రం చేయడం, పిచ్చి మొక్కలు తొలగించడం, మృతదేహాలను అంత్యక్రియల కోసం శ్మశాన వాటికకు తీసుకువెళ్లడం ఇత్యాధి అవసరాల కోసం పలు రకాల వాహనాలను కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. వీటిలో ఆటో చెత్త ట్రాలీలు, ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకులు, స్వీపింగ్ మిషన్, డోజర్, బ్లేడ్ ట్రాక్టర్లు, వైకుంఠరథాలు ముఖ్యమైనవి.

మూలకుపడితే అంతే సంగతులు...

మున్సిపల్ వాహనాలు ఒకటి, రెండు సార్లు మాత్రమే మరమ్మతులకు నోచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మరమ్మతులకు వస్తే అంతే సంగతులు. ఎంచక్కా పక్కకు పడేసి వృథాగా ఉంచుతున్నారనే విమర్శలు ఉన్నాయి. రోజులు, నెలలు, ఏళ్లుగా ఎక్కడికక్కడ వాహనాలు నిలిపి ఉంచి చోద్యం చూస్తున్నారు. దీంతో ఖరీదైన వాహనాలు అలంకార ప్రాయంగా ఉండాల్సి వస్తోంది. కొన్ని మున్సిపాలిటీల్లో పూర్తిస్థాయిలో వాహనాలు లేని పరిస్థితులు ఉన్నాయి. వైకుంఠరథం లేని మున్సిపాలిటీల్లో ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్న రథాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇందుకోసం రూ.1500 నుంచి రూ.2,500వరకు చెల్లించుకుంటున్నారు. మరమ్మతుల పేరిట అందినంత దండుకుంటున్నట్లు తెలుస్తుండగా, స్క్రాప్ అమ్మకాల్లో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు పుర ప్రజలు విమర్శిస్తున్నారు. వాహనాల విషయంలో మున్సిపల్ అధికారులు సరైన శ్రద్ధ కనబర్చి సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరమ్మతు చేయిస్తాం



మున్సిపాలిటీకి ఇటీవలనే బదిలీపై వచ్చాను. వచ్చిరాగానే వాహనాల పనితీరు, మరమ్మతులకు వచ్చిన వాహనాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నాను. కొన్ని వాహనాలు మరమ్మతులకు వచ్చి ఉన్నాయి. వీటికి ఎస్టిమేషన్ వేయించి ప్రతిపాదనలు చేస్తాం. అవసరమైన వాహనాలను త్వరగా రిపేరు చేయించి పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకుంటా. – తన్నీరు రమేశ్, మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

జిల్లాలోని బల్దియాల్లో ఉన్న వాహనాల వివరాలు

వాహనాలు	బెల్లంపల్లి	మంచిర్యాల	మందమర్రి	చెన్నూర్	లక్సెట్టిపేట	పని చేస్తున్నవి (మొత్తం)	రిపేరుకు వచ్చినవి
ఆటోచెత్తట్రాలీలు	23	83	24	16	14	109	51
ట్రాక్టర్లు	03	25	03	02	03	36	03
వాటర్ ట్యాంకర్లు	02	35	02	00	01	40	01
డోజర్లు	01	00	00	00	00	01	00
బ్లేడ్ ట్రాక్టర్లు	00	01	00	00	00	01	00
స్వీపింగ్‌మిషన్లు	01	02	00	00	00	03	01
జేసీబీలు	00	02	00	00	00	02	00
వైకుంఠరథాలు	01	04	01	01	00	07	00

క్లుప్తంగా

సల్లంగ చూడు.. పోచమ్మతల్లి



లక్సెట్టిపేట: బోనాలతో గ్రామ ప్రజలు

మంచిర్యాలఅర్బన్/లక్సెట్టిపేట/చెన్నూర్‌రూరల్: ఆషాఢమాసం పురస్కరించుకొని గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల అశోక్‌రోడ్‌లో భక్తులు హమాలీవాడ కట్టపోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. లక్సెట్టిపేట మండలంలోని హన్మంతుపల్లిలో, చెన్నూర్ మండలంలోని కాచన్‌పల్లిలో ఊరి పోచమ్మకు బోనాలు సమర్పించారు. సల్లంగ చూడంటూ పోచమ్మ తల్లిని వేడుకున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

దండేపల్లి: దండేపల్లి మండల కేంద్రంలోని పడమటి కాలనీ వాసుల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

మాజీ ఎమ్మెల్యే ఓదెలుకు పరామర్శ



ఓదెలును పరామర్శిస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్

మందమర్రిరూరల్: చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు నల్లాల ఓదెలు కొంత కాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందాడు. గురువారం మందమర్రికి రాగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పరామర్శించారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు అందుగుల శ్రీనివాస్, నరేష్, దీక్షితులు, సంజీవరావు, జనార్దన్, రవిసాగర్ తదితరులు ఉన్నారు.

గంగస్నానానికి గ్రామ దేవతలు



గంగాస్నానానికి వెళ్తున్న గిరిజనులు

నెన్నెల: మండలంలోని దుబ్బగూడం భీమన్న, లక్ష్మీ దేవర, పోతరాజు, మారమ్మ గ్రామ దేవతతో గురువారం డప్పు చప్పుళ్లతో గంగాస్నానానికి ఎల్లారం పాదయాత్రగా బయలుదేరారు. దేవుళ్లకు ఎల్లారంలోని గుండాలలో జలాభిషేకాలు చేయిస్తామని గిరిజనులు తెలిపారు. గంగస్నానం చేయిస్తే వర్షాలు సంవృద్ధిగా కురిసి, పంటలు బాగా పండుతాయని గ్రామీణుల నమ్మకం. నాటి నుంచి ఆనవాయితీగా వస్తోంది. వర్షాలు బాగా కురిసి వాగులు, చెరువులు నిండాలని, పిల్లాపాపలతో అందరూ చల్లగా ఉండాలని వేడుకున్నారు. గిరిజనులంతా కలిసి గ్రామ దేవతలతో గంగబాట పట్టారు.

నేత్రదానం



మృతుడు తిరుపతి (ఫైల్)

బెల్లంపల్లి: ఇంటి పైకప్పు కూలడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందిన ఓ వ్యక్తి కళ్లను కుటుంబ సభ్యులు దానం చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ హన్మాన్ బస్తీకి చెందిన కందుకూరి తిరుపతి బుధవారం ఇంటి పై కప్పు సర్దుతుండగా ప్రమాదవశాత్తు ఇంటి రేకులు కూలిపోవడంతో కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి లో చికిత్స పొందుతూ గురువారం చనిపోయాడు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వర్గాలు తిరుపతి రెండు కళ్లను సేకరించి తీసుకెళ్లారు.

'కబ్జా అని నిరూపిస్తే భూమి రాసిస్తా'

శ్రీరాంపూర్: తను భూకబ్జాదారుండని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బేర సత్యనారాయణ చేసిన ఆరోపణలు నిరూపిస్తే ఆ భూమిని పేదలకు రాసిస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్ని మధూకర్ తెలిపారు. నస్పూర్‌కాలనీ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. సీతారాంపల్లి సర్వేనెంబర్ 8లో తాను భూకబ్జా చేశానని ఆరోపించారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రొడ్డ రాజేశం, రేంక రవి, సంపత్ రెడ్డి, భూపతి శ్రీనివాస్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్ బాలికల హాస్టల్లో ఖాళీగా ఉన్న హెడ్‌కుక్ పోస్టుకు స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి వెంకటేశ్వరస్వామి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, మార్కుల మెమో, 1నుంచి 10 వరకు బోనోఫైడ్, నివాస ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో 4నుంచి 7వ తేదీ లోపు మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

బీఎల్‌వోల పాత్ర చాలా కీలకం



అవగాహన కల్పిస్తున్న చంద్రకళ



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

లక్సెట్టిపేట: ప్రజాస్వామ్య వ్యవస్థ విజయవంతంలో బీఎల్‌వోల పాత్ర చాలా కీలకమైనదని ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌వోలు శిక్షణ సమయంలో ప్రతి విషయాన్ని క్లుప్తంగా నేర్చుకోవాలని, అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటరు నియమావళి, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, డీటీ శ్రావణి, మాస్టర్ ట్రైనర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: స్థానిక మోడల్ స్కూల్లో బీఎల్‌వోలకు శిక్షణ తరగతులను తహసీల్దార్ సతీశ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఈఆర్‌వో చంద్రకళ హాజరయ్యారు. ఫార్మ్ 6, 7, 8, 8ఏ లపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి ఓటరు నమోదుపై దృష్టి సారించాలన్నారు. అడ్రస్, ఓటరు అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ సంతోష్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు ఉన్నారు.

బీఎల్‌వోలకు అవగాహన

నస్పూర్: నేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ టూ బూత్‌లెవల్ ఆఫీసర్స్ కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలోని సింగరేణి గెస్ట్‌హౌజ్‌లో బూత్‌లెవల్ అధికారులకు మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. బీఎల్‌వో యాప్, ఫాం 6, 7, 8, 8ఏ లపై శిక్షణ ఇచ్చారు. జూలై 1 వరకు 18సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, మాస్టర్ ట్రైనర్స్ సత్తయ్య, భరత్, పలువురు బీఎల్ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

భీమిని: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి యాదయ్య తెలిపారు. కన్నెపల్లి మండలంలోని ఐదపల్లి పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. విధులకు సకాలంలో హాజరుకావాలని, లేకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు 50 డెస్కుల అందజేత

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ఒర్రెగడ్డ ఏరియాలో గల జెడ్పీ హైస్కూల్ (బాయ్స్)కు బ్లూడాన్ సంస్థ 50డ్యూయల్ డెస్కులను అందజేసింది. హైస్కూల్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి యాదయ్య, ఏరియా జీఎం దేవేందర్, మున్సిపల్ కమిషనర్ ఈ కార్యక్రమానికి హాజరై సంస్థ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మౌళి, శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు సౌకర్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో డెస్కులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ సిబ్బంది ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

లేబర్ కోడ్లతో కార్మికులకు నష్టం



మాట్లాడుతున్న సింగరేణి ఐక్యవేదిక నాయకులు

శ్రీరాంపూర్: కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరగనుందని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. ఆర్కే 7 గనిపై గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వేదిక నాయకులు మాట్లాడారు. కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వాటి స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లతో ప్రభుత్వ రంగ సంస్థల్లో కార్మికుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందన్నారు. కేవలం పెట్టుబడిదారులకు, ప్రైవేటు సంస్థలకు లాభం చేకూర్చేలా ఈ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. పోరాటాల ద్వారానే కేంద్ర విధానాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేదిక నాయకులు ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, నాయకులు డి.బ్రహ్మానందం, హెచ్ఎంఎస్ కేంద్ర నాయకులు తిప్పారపు సారయ్య, ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, నాయకులు కంబాల నరసయ్య, రాజేంద్రప్రసాద్, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు సమ్ము రాజయ్య, నీరటి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీలో చేరిక

మందమర్రిరూరల్: ఏరియాలోని కేకే–ఓసీలో ఏఐటీయూసీ మైన్ కమిటీ మెంబర్ చరణ్య గురువారం ఐన్టీయూసీలో చేరారు. వారికి ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య యూనియన్ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ భూమయ్య, నాయకులు, యేకుల సత్యం, నూనె సాంబయ్య, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

మారు పేర్ల సమస్య పరిష్కరించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో మారుపేర్లతో పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని బాధితులు తెలిపారు. నస్పూర్ కాలనీలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. చాలా ఏళ్ల క్రితం కంపెనీలో తాము చేరినప్పుడు పేర్లు పొరపాటుగా పడటం, ఒకరి పేరు స్థానంలో మరొకరి ఎంట్రీ చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాధితులు దెబ్బటి అంజయ్య, జీ రాజయ్య, ఎం రవికుమార్, సంకీర్తన్ పాల్గొన్నారు.

కాసిపేట గురుకులంలో ఉచిత వైద్య శిబిరం



విద్యార్థి కళ్లను పరీక్షిస్తున్న ఆప్తమాలజిస్ట్ అంజయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘీక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ ఫిజిషియన్స్ వైద్యులు యశ్వంత్ చంద్ర, వంశీ విద్యార్థులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆప్తమాలజిస్ట్ అంజయ్య కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలు అరుణసుందరి, కార్యదర్శి ఆదర్శ్ వర్ధన్‌రాజు, వుమెన్‌ఎంపవర్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ ఎర్ర సువర్ణ, మెడికల్ కో ఆర్డినేటర్ సీ.హెచ్.సుదర్శన్, కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్, లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రభాకర్, నర్సయ్య, సమ్మయ్య, మహేశ్వర్ రెడ్డి, జయచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడొద్దని విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జన్నారం: అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగుల నిషేధిత దినోత్సవం పురస్కరించుకొని గురువారం జన్నారం మండల కేంద్రంలో రాఘవేంద్ర లిటిల్ హన్స్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. దుకాణదారులతో ప్లాస్టిక్ నిషేధం గురించి వివరించారు. పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరైన జన్నారం మాజీ జెడ్పీటీసీ, రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నిత్యజీవితంలో భాగంగా మారిందని, దానిపైనే పూర్తిగా ఆధారపడ్డామని, ఈ భూతాన్ని తరిమికొట్టి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డీన్ హేమలత షిండే, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వాగు కాదు.. రోడ్డే



భీమారం: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ నుంచి ఎస్సీకాలనీకి వెళ్లే రహదారిలో నీళ్లు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కాలువల నిర్మాణం పనులు పూర్తి చేస్తే కానీ, ఈ నీటి సమస్య పరిష్కారం కాలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని రోడ్డుపై నీరు నిలువకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి

చెన్నూర్: పంట మార్పిడితో అధిక దిగుబడి వస్తుందని ఆత్మ చైర్మన్ రఘునందన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఏడీఏ కార్యాలయం వద్ద జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. కంది పంటను అంతర్ పంటగా వేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, ఏడీఏ బానోత్ ప్రసాద్, సహకార సొసైటీ చైర్మన్ చల్లా రాంరెడ్డి, ఏవో యామిని పాల్గొన్నారు.

కంది విత్తనాలు పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నాగారం గ్రామంలోని రైతులకు జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా గురువారం కంది విత్తనాలు పంపిణీ చేశారు. రైతులు సాగులో అంతరపంటగా కంది దినుసుల పంట సాగు చేయాలని, ముఖ్యంగా కంది విత్తనాలను పొలం గట్లపై కూడా వేసి లాభాలు పొందాలని ఏడీఏ అనిత, ఏఓ కృష్ణ రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో మౌనిక, స్థానిక రైతులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

కోటపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్.రామచంద్రరావును గురువారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, కోటపల్లి మాజీ ఎంపీపీ మంత్రి సురేఖ, రామయ్య మర్యాదపూర్వకంగా కలిసి అయోధ్య రామయ్య జ్ఞాపికతో పాటు భగవద్గీతను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతువేదికలో గురువారం అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు కృష్ణతేజ, నిహారిక, వారిశ్‌ఖాన్, సబ్ యూనిట్ అధికారి జగదీశ్, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి వినియోగంలోకి వచ్చేనా..?



బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలో దశాబ్దాల క్రితం నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయి, వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. కరోనా సమయంలో అండర్ బ్రిడ్జి క్రింద నుంచి వాహనాల రాకపోకలు సాగించకుండా ఇనుప గేట్ ఏర్పాటు చేసి కట్టడి చర్యలు తీసుకున్నారు. కరోనా మహమ్మారీ క్రమంగా తగ్గుముఖం పట్టి ప్రజలు సాధారణ జీవనానికి అలవాటు పడుతున్న క్రమంలో రైల్వే అధికారులు రైల్వే మూడోలైన్ పనులు చేపట్టారు. దీంతో రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ప్రస్తుతం రైల్వే మూడో లైన్ పనులు తుదిదశలో ఉన్నాయి. బజారు ఏరియా నుంచి కాల్‌టెక్స్‌కు రావడానికి రైల్వే అండర్ బ్రిడ్జి సౌకర్యంగా ఉండగా, రాకపోకలకు అనుమతించడం లేదు. వాహనదారుల పక్షాన రైల్వే అధికారులు సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అండర్ బ్రిడ్జి క్రింద వరదనీరు నిలిచి ఉంది. అక్కడ నీరు నిలవకుండా చర్యలు తీసుకుని, రైల్వే అండర్‌బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

ఫ్లై ఓవర్‌పై లైటింగ్ ఏర్పాటు చేయాలి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై లైట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ మహంకాళి శ్రీనివాస్, వివేక్ యువసేన సభ్యులు గురువారం మున్సిపల్ కమిషనర్ రాజును కలిసి వినతిపత్రం అందించారు. విఠల్‌నగర్ నుంచి బ్రిడ్జి వరకు రోడ్డు వెడల్పు చేయాలని, ఆర్వోబీ సర్వీసు రోడ్డుని సరిగ్గా బ్రిడ్జి వరకే కాకుండా మరికొంత పొడిగించాలని కోరారు. సభ్యులు మహేష్, సత్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

చెన్నూర్: వాహనాలు అతి వేగంగా నడిపితే ప్రమాదాలు జరుగుతాయని సీఐ దేవేందర్‌రావు అన్నారు. స్థానిక కొత్త బస్టాండ్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజ మనోహర్‌ను మంచిర్యాల మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, అధ్యక్షుడు గోగర్ల ఆశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కలు పంపిణీ

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారంలో ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి మొక్కలు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సునీత, కార్యదర్శి హరీష్, ఈజీఎస్ టీఏ రాజమల్లు తదితరులు ఉన్నారు.

మహాసభ విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: ఈ నెల 20న నిర్వహించే నేతకానీ మహర్ ప్రతినిధుల మహాసభను విజయవంతం చేయాలని నేతకానీ మహర్ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో గురువారం రాష్ట్రస్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.

యూనిఫాం, పుస్తకాలు అందించాలి

కాసిపేట: ప్రతి పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు వెంటనే ఇవ్వాలని జిల్లా వయోజనవిద్య అధికారి, మండల ప్రత్యేకాధికారి పురుషోత్తం నాయక్ సూచించారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉన్నత పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, మండలస్థాయి అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ తదితరులు పాల్గొన్నారు.